


# వెన్నెల

## నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల



1985 లేదా 1986వ సంవత్సరం అనుకుంటాను. మా ఆస్టిన్‌లో ఇండియన్ షాప్‌కి వెడితే అక్కడ ఒక తెలుగు సినిమా కనపడింది. ఆ రోజుల్లో అమెరికాకి తెలుగు సినిమాలు రావటమే తక్కువ, ఏవో కొన్ని మంచి సినిమాలు తప్ప. అప్పుడు డీవీడీలు లేవు. అన్నీ విడియో కాసెట్లే.

నన్ను చూసి మా షాప్ ఓనర్ నాయర్ అన్నాడు 'ఈ సినిమా బాగుందని అంటున్నారు తీసుకువెళ్ళిన వాళ్ళంతా' అని. సరేనని ఆ కాసెట్ తీసుకుని ఇంటికి వచ్చి చూడగానే అది నా అభిమాన దర్శకుడు విశ్వనాథ్‌గారి సినిమా. ఎంతో చక్కటి కథ, పాటలు, నటన. ప్రతి సీనులోనూ నాకు విశ్వనాధ హస్తం కనిపిస్తూనే వుంది.



ఇంతలో ఇంకో పాట - 'విధాత తలపున ప్రభవించినది అనాది జీవన వేదం. ఓం. ప్రాణనాడులకు స్పందన నొసగిన ఆది ప్రణవనాదం. విరించి నై విరచించితిని ఈ కవనం విపంచినై వినిపించితిని ఈ గీతం... ' నిజంగానే విరించి వ్రాయవలసిన ఘనమైన సాహిత్యం అది. ఎవరు వ్రాశారో తెలియలేదు. బాలు మధురంగా పాడుతుంటే మనసు అలా అలా తేలిపోయింది.

రీవైండ్ బటన్‌తో వెనక్కి ముందుకి వెడుతూ ఆ పల్లవినే పలుమార్లు విన్నాను. ఎవరబ్బా ఇంత గొప్ప కవి అని ఆశ్చర్యపోయాను కూడాను.

తర్వాత తెలిసింది సీతారామశాస్త్రి అనే ఒక కొత్త రచయిత అని. నిజం చెప్పొద్దూ అదెవరో సంస్కృతం తెలుగులలో పాండిత్యంవున్న ఏ శాలువానో కప్పుకున్న వయసు మీరిన ఆయన అని ఎందువల్లనో మరి అనిపించింది. ఆ పాటని ఒక ఆడియో కాసెట్ మీదకి ఎక్కించి ఎన్ని వందలసార్లు విన్నానో చెబితే అది అతిశయోక్తి కాదు. తర్వాత చాల రోజులకి ఏదో పుస్తకంలో ఆ రచయితకి బహుమతి వచ్చిందని వ్రాస్తూ ఒక ఫొటో కూడా వేశారు. అప్పుడే తెలిసింది ప్యాంటూ చొక్కా వేసుకున్న సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు కవిత్వంలో చాల చాల పెద్దవాడు కానీ, వయసులో కాదని.

నాకు చిన్నప్పటినించీ సినిమా పాటలు వింటున్నప్పుడు, సంగీతంతో పాటూ సాహిత్యం కూడా ఆస్వాదించటం అలవాటు.

'సృష్టి చేసినది దేవుడైన మరి నాశము నేల సృజించె? కనుల నొసగినది దేవుడైన మరి అంధుల నేల సృజించె?' అని బాటసారిలో సముద్రాల, 'మొగలి పూల వాసనతో జగతి మురిసిపోయింది. నాగమల్లి పూలతో నల్లని జడ నవ్వింది.

పడుచుదనం అందానికి తాంబూలమిచ్చింది. ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది' తెలుగు సాహిత్యానికి ఆరుద్ర కర్పూర తాంబూలం, 'మరిగి పోయేది మానవ హృదయం. కరుణ నిచ్చేది చల్లని దైవం. వాడే లతకు ఎదురై వచ్చు వాడని వసంత మాసం. వసివాడని కుసుమ విలాసం' దేవులపల్లి కృష్ణశాస్త్రి భావుకత, 'నీ కర కంకణ నిక్వణమా అది వాణీ వీణా నినాదమా? నీ పద నూపుర నిస్వనమా అది జలధితరంగ మృదంగరావమా? 'రావే మోహన రూపమా, రావే నూతన తేజమా' శబ్ద సౌందర్యాన్ని నిశ్శబ్దంగా వాడి వెన్నులో వేడి పుట్టించిన మహాకవి శ్రీశ్రీ, 'తెల్లవార వచ్చె తెలియక నా స్వామి మళ్ళి పరుండేవు లేరా' అని తన మృదుమధురమైన మాటలతో మనల్ని మేల్కొలిపిన మల్లాది, 'గుండె మంటలారిపే సన్నీళ్ళు కన్నీళ్ళు వుండమన్న వుండవమ్మ శాన్నాళ్ళు. పోయినోళ్ళందరూ మంచోళ్ళు. ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు' చావు బ్రతుకుల సారాన్ని కన్నీళ్ళతో కడిగి, గుండె మంటల నార్పుతూ తీపి గురుతులు మనకిచ్చిన ఆత్రేయ. పేరు పేరునా పాదాభివందనం చేయవలసిన కవులు వీరు. సాష్టాంగ నంస్కారం చేయవలసిన ఘనులు వీరు. తర్వాత తెలుగు సాహిత్యం ఆ-రేసుకోబోయి పారేసుకున్న ద్వందార్థాలతోనూ, తర్వాత ఒకే బూతు అర్థంతో 'నీ సిగ్గు ఎగ్గు లెంతవరకూ నీ చీర జారు వరకు'తో దిగజారి పోయింది. 'అబ్బ నీ దెబ్బ నీ' దెబ్బలతో అధోగతికి వెళ్ళిపోయింది. దాని తర్వాత మనకి వచ్చిన వెన్నెలే ఈ సిరి వెన్నెల.

శృతిలయలు అనే ఒక చక్కటి సినిమా వచ్చింది. దాంట్లో అన్నమాచార్య పాటలు వున్నాయి. వాటిల్లో నాకు బాగా నచ్చింది యేసుదాస్ సుశీల వేరువేరుగా పాడిన 'తెలవారదేమో స్వామీ' అనే పాట. ఎవరో ఇండియానించీ వస్తుంటే సిడీ తెప్పించుకున్నాను. దాని మీద అన్నమాచార్య కీర్తన అని వుంది. కారులో రోజూ చాల రోజులు విన్నాను. ఇప్పటికీ సమయం దొరికినప్పుడు వినే పాటల్లో అదొకటి. దాని తర్వాత ఒకసారి ప్రముఖ గాయకులు బాలకృష్ణ ప్రసాద్‌గారు మా వూరు వచ్చినప్పుడు, అన్నమాచార్య పాటల్లో నాకిష్టమైన పాట ఇది అంటే, ఆ పాట అన్నమాచార్యది కాదు సీతారామశాస్త్రిగారిదన్నారు. నా జీవితంలో అంతగా ఆ-శ్చర్యపోయిన సంఘటన ఇంకొకటి లేదని గట్టిగా చెప్పగలను. ఎందుకంటే ఆ పదాల పొందిక, మామూలు మాటల వెనుక బలీయమైన ఆధ్యాత్మిక భావన, అన్నమాచార్యే బ్రతికి వుంటే గర్వంగా శాస్త్రిగారి భుజం తట్టి వుండేవాడు.

శాస్త్రిగారి పాటల్లో నాకు బాగా నచ్చింది, వినపడే పాట వెనకాల కనపడే ఎంతో లోతైన ఆలోచన. సందర్భానుసారంగా వ్రాసే పాటల్లోనే కాక, సాదా సీదా ప్రేమ పాటల్లో గాలి పాటల్లో కూడా నాకు అదే కనిపిస్తుంది. ఏమిటి ఈ పెద్ద మనిషి ప్రతి చిన్న విషయానికీ ఇంత దీర్ఘంగా ఆలోచిస్తాడు అనుకునేవాడిని. ప్రతి పాట వెనుక ఒక పరిశీలనో, నిగూఢమైన భావనో వినిపిస్తూనే వుంటుంది. అంతేకాదు సముద్రాల సముద్రమంత తాత్విక చింతన, దేవులపల్లి భావుకత, మల్లాది పదలాలిత్యం, ఆరుద్ర అచ్చ తెలుగు నుడికారం, శ్రీశ్రీ శబ్దగాంభీర్యం, ఆత్రేయ మనసు మీద మమకారం అన్నీ ఈయన కవిత్వంలో కనిపిస్తాయి. పైన చెప్పిన వన్నీ నాకిష్టం కాబట్టి సిరివెన్నెల సీతారామశాస్త్రిగారి కవిత్వమంటే నాకు వల్లమాలిన ఇష్టం.

దాదాపు ఎనిమిదేళ్ళయిందేమో సీతారామశాస్త్రిగారు మా వూరు వచ్చారు. అయనతో సాహిత్య గోష్టి. ఆయన పక్కనే కూర్చుని, ఎంతో ఆసక్తితో వింటున్నాను. నన్ను ఎవరో పరిచయం చేశారు. 'మీ అమెరికా బేతాళుడి కథలు చదివాను. బాగున్నాయి' అన్నారు. నా కథలెలా వున్నా నాలాటి చితకవాడిని మెచ్చుకోవటం ఆయన సంస్కారం.

నాకెంతో ఇష్టమైన ఆయన వ్రాసిన కొన్ని పాటలను వివరణగా చెప్పటం మొదలుపెట్టాను. నాకూ మా ఆవిడకీ ఇష్టమైన పాట ఊయల అనే సినిమాలో గోపాల బాలుడమ్మా

అని చిత్ర భావయుక్తంగా పాడిన పాట. మీ అమ్మ నిన్ను నవమాసాలూ మోసి కంటున్నది, ఈ వరాలు మీ అమ్మ కివ్వవయ్యా అని బ్రహ్మ పసికందుకి ఇస్తే, వాడు అమ్మ ఒడిలో పడుకుని గుప్పిళ్ళు తెరిచి వరాలు ఆవిడకి అందించాడుట. ఎంత అందమైన ఊహ. జాషువాగారి పాపాయి పద్యాల తర్వాత ఎన్నాళ్ళకో విన్న మధురమైన భావన. అలాగే ఏదో ఒక రాగం అనే పాటలో 'జ్ఞాపకాలె మైమరుపు, జ్ఞాపకాలె మేల్కొలుపు, జ్ఞాపకాలె నిట్టూర్పు, జ్ఞాపకాలె ఓదార్పు' మనసుకి ఊరట కలిగించే మరువలేని మరువాలు. 'భావనె భవునకు భావ్యము కాగా, భరతమె నిరతము భాగ్యము కాగా... అందెల రవమిది పదములదా...', 'కాటుక కంటి నీరు పెదవుల నంటనీకు, చిరునవ్వు దీప కళిక చిన్నబోనీకు, నీ బుజ్జి గణపతిని బుజ్జగించి చెబుతున్నా నీ కుంకుమకెపుడూ పొద్దుగుంకదమ్మా... ' ఇలా చెప్పుకుంటూ పోతుంటే ఎన్నో ఎన్నెన్నో.

ఆయన తను వ్రాసిన కొన్ని పాటల నేపథ్యాన్ని చెబుతూ, ఆ పాటలు వినిపించారు. ఆయన కవిత్వంలోని లాలిత్యమే కాక ఆవేశంకూడా ఆరోజే చూశాను. ప్రభుత్వం వారి కోరిక మేర తను భారత స్వర్ణోత్సవాల సందర్భంగా వ్రాసిన ఒక పాట. అది శ్రీ ప్రభుత్వంవారికి నచ్చని పరిస్థితిలో ఒక సినిమాలో వాడుకున్నారుట. 'తనలో భీతిని తన అవినీతిని తన ప్రతినిధులుగ ఎన్నుకుని, ప్రజాస్వామ్యమని తలచే జాతిని ప్రశ్నించటమే మానుకుని... చూస్తూ ఇంకా నిదురిస్తావా విశాల భారతమా.. ' తర్వాత ఆ పాట కోసం సిందూరం అనే ఆ సినిమా కూడా చూశాను.

అప్పుడే ఆయన్నో ప్రశ్న కూడా అడిగాను 'అయ్యా! కూటికోసం గుడ్డ కోసం సినిమాల్లో బూతు పాటలు వ్రాస్తున్నామని పండితులే సమర్థించుకుంటున్న ఈ రోజుల్లో, బూతు పాటలు వ్రాయకుండా బ్రతకవచ్చునా?' అని. ఆయన నవ్వి 'ఆ రోజుల్లో రచయితలూ చక్కగా బ్రతకగలిగారు, ఈనాడు నేనూ బ్రతుకుతున్నాను' అన్నారు.

అందుకే ఆయన నా దృష్టిలో చేయి జారని రచయిత!

2000 సంవత్సరం ఆటా కార్యక్రమంలో నా పుస్తకం, గవర్నమెంటాలిటీ కథలు ఆయనే విష్కరించారు. రెండేళ్ళ క్రితం నేను ఇండియాకి వచ్చినప్పుడు హైద్రాబాద్‌లో వాళ్ళింటికి ఫోన్ చేస్తే స్టూడియోకి వెళ్ళారని చెప్పారు ఆయన శ్రీమతి. ఇంటికి రాగానే నాకు ఫోన్ చేసి కుశలమడిగారు. ఎన్నారై కబుర్లు చదువుతున్నాననీ చెప్పారు.

ఎన్నో చక్కటి పాటలు వ్రాసి మంచి సాహిత్యాన్ని అందించి, మన తెలుగు సినిమా సాహిత్యాన్ని పాతాళలోకం లోనించి మళ్ళీ బయటికి తీసుకువచ్చిన రచయిత. ఆయన వ్రాసిన పాటలన్నీ గొప్ప కవితా ఖండాలు కాకపోవచ్చు కానీ, ఈనాడు సినిమా పాటలు వినాలంటే కాస్త వినదగ్గవి శాస్త్రిగారి పాటలే.

కొత్తగా సినిమాల్లో పాటలు వ్రాసేవారికి ఆయన కవితలు స్పందననిస్తే, మళ్ళీ మన తెలుగు సినిమా సాహిత్యానికి మంచి రోజులు వస్తాయేమో!

*పోర్ట్రెయిట్ చిత్రీకరణ: డా.సురేంద్ర*

ప్రాణాలే పందెంగా వేసి పోరాడందే.
ఏ విజయం ఒళ్ళో పడుతుందీ..!
ఏనాడో చెప్పిందీ..ఏనాడూ మారనిదీ..
శ్రీ కృష్ణుడి గీతా సారమిదీ..!
యుద్ధం మొదలవ్వందే. ప్రశ్నిస్తూ కూర్చుంటే
అపజయమే బదులై వస్తుందీ..!

**సిరివెన్నెల**